క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

కరీమాబాద్: పార్టీలోని ప్రతీ కార్యకర్తకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 42వ డివిజన్ లెనిన్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రొయ్యల సాయిప్రసాద్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా పార్టీ ఇన్సూరెన్స్‌కు సంబంధించిన రూ.2 లక్షల చెక్కును మృతుడి తల్లిదండ్రులకు ఎమ్మెల్యే గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కేడల పద్మ, కొంతం మోహన్, పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్, కర్ర కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి ప్యాషన్ ప్లస్ 100 సీసీ బైక్


బైక్‌ను విడుదల చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై

రామన్నపేట: ములుగురోడ్డులోని శ్రీశ్రీశ్రీ హీరో షోరూంలో లెజెండరీ ప్యాషన్ ప్లస్ 100 సీసీ బైక్‌ను మట్టెవాడ ట్రాఫిక్ ఎస్సై ఆర్.రామారావు మార్కెట్‌లోకి గురువారం విడుదల చేశారు. డిజి అనలాగ్ మీటర్, స్పెషన్ యుటిలిటీ కేస్, మొబైల్ చార్జింగ్ పాయింట్, ప్లష్ సీట్, ఈ – 20 ఎక్స్‌పీరియన్స్ లాంటి సరికొత్త ఫీచర్లు పాషన్ ప్లస్ 100 సీసీ బైక్ ప్రత్యేకతలని షోరూం జీఎం వి.రమేష్‌మూర్తి వివరించారు. 3 రంగులలో బైక్‌లు అందుబాటులో ఉన్నాయని, ప్రారంభ ధర 75,641 ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఇండసిండ్ బ్యాంక్ మేనేజర్ జి.నవీన్‌కుమార్, శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్ డి.శ్రీనివాస్, షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐకానిక్ ప్యాషన్ ప్లస్ విడుదల


మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న క్రీడాకారులు

హన్మకొండ: హీరో మోటార్స్ వారి నూతన ఉత్పత్తి ఐకానిక్ ప్యాషన్ ప్లస్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. హనుమకొండ నక్కలగుట్టలోని శ్రీ వైష్ణవి ఆటోమొబైల్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఇండియన్ చెస్ సూపర్ గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్, సీనియర్ నేషనల్, ఇంటర్ నేషనల్ చెస్ గోల్డ్ మెడలిస్ట్ మ్యాకల శ్రీకాంత్.. నూతన ఐకానిక్ పాషన్ ప్లస్‌ను విడుదల చేశారు. మొదటి వాహనాన్ని వినియోగదారుడు గడల చేరాలుకు అందించారు. కార్యక్రమంలో శ్రీ వైష్ణవి ఆటో మొబైల్స్ అధినేత చందుపట్ల సత్యపాల్ రెడ్డి, మేనేజర్ కోల మధు, నెట్‌వర్క్ మేనేజర్ సయ్యద్ అబ్దుల్, మురళీకృష్ణ, శ్రీరాం ఫైనాన్స్ డీఎం ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కాలనీలో బొర్ర హోండా షోరూం ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న అతిథులు

కాశిబుగ్గ: వరంగల్ లేబర్‌కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బొర్ర హోండా షోరూంను కంపెనీ సర్వీస్ జోనల్ మేనేజర్ ఎస్.పార్థసారథి, సేల్స్ ఇన్‌చార్జ్ అమిత్ బయ్యా, బొర్ర హోండా ఎండీ ధీరజ్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్‌కాలనీ ప్రజల సౌకర్యార్థం అత్యాధునిక ప్రమాణాలతో కూడిన హోండా షోరూంను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ షోరూంలో నూతన టెక్నాలజీ గల హోండా బీఎస్–6 ఫేస్–2 గల వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హోండా సర్వీస్ ఏరియా ఇన్‌చార్జ్ సత్య స్వరూప్, సేల్స్ మేనేజర్ శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె ప్రగతితోనే గ్రామాల అభివృద్ధి


పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్, కార్యదర్శి

హసన్‌పర్తి: పల్లె ప్రగతితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని సర్పంచ్ బండా అమితారెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలో పల్లె ప్రగతి దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గ్రామాభివృద్ధిని విస్మరించాయని అన్నారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రామాభివృద్ధిపై రూపొందించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యకమంలో స్పెషల్ ఆఫీసర్ కల్పన, పంచాయతీ కార్యదర్శి కల్పన, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం


హన్మకొండ: ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తూ..


సమావేశంలో మాట్లాడుతున నాగార్జున

హన్మకొండ: విద్యారంగాన్ని విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషాబోయిన సంతోష్ హెచ్చరించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగం సమస్యలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు హక్కు లేదని విద్యార్థుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలను వెంటనే మూసివేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్ యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, నాయకులు అనిల్, సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిలో ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, బూట్లు, టై, బెల్ట్, డైరీ, ఇతర వస్తువుల పేరుతో వేలాది రూపాయలను అక్రమంగా వసూలు చేస్తున్నట్లు శ్రీకాంత్ వాపోయారు.

అనుమతి లేకుంటే దాడులు చేస్తాం..

వరంగల్ చౌరస్తా: అనుమతి లేకుండా విద్యాసంస్థలు నిర్వహిస్తే ప్రత్యక్ష దాడులు చేస్తామని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున హెచ్చరించారు. వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో రామ్‌మోహన్ అధ్యక్షతన ఏఐఎఫ్‌డీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ప్రైవేట్ విద్యాసంస్థలు పాటించాలని సూచించారు. ఫీజు నియంత్రణ కమిటీ వేసి అధిక ఫీజులను అరికట్టాలన్నారు. విద్యాహక్కు చట్ట ప్రకారం పేద విద్యార్థులకు 25శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇచ్చే విధంగా జీఓ చేయాలని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, రాష్ట్ర కోశాధికారి పోతుగంటి కాశి, పిట్టల సాయికుమార్, మోహన్, సాయి, భాను పాల్గొన్నారు.

పేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

న్యూశాయంపేట: ఇళ్లు లేని పేదలకు పక్కా గృహాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మించి ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. హనుమకొండ సుందరయ్య భవన్‌లో తెలంగాణ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇచ్చి కేంద్రం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయంతో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సూచించారు. వేసుకున్న గుడిసెలను కూల్చివేసి దాడులకు పాల్పడటం సరైంది కాదని అన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య మాట్లాడుతూ ఈనెల 18నుంచి 27 వరకు రాష్ట్రవ్యాప్త బస్సుయాత్ర, 19న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా, వచ్చే నెల 3న కలెక్టరేట్‌ల ఎదుట మహా ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉప్పలయ్య, చక్రపాణి, వెంకట్, సంపత్, దీప, కిషోర్, కుమార్ పాల్గొన్నారు.

‘ప్రైవేట్’కు దీటుగా విద్యా బోధన


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

కాజీపేట రూరల్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని కార్పొరేటర్ సంకు నర్సింగరావు అన్నారు. కాజీపేట 47వ డివిజన్ పరిధిలో బాపూజీనగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఆర్ ఎల్.మేరి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం బాపూజీనగర్, అంబేడ్కర్‌నగర్, పోచమ్మగుడి ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లోని నాణ్యమైన బోధన, సదుపాయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వాణి, కరీబ్ హస్సన్, బీఆర్ఎస్ నాయకులు మర్యాల కృష్ణ, మైలారం శంకర్, పప్పుల గోవర్ధన్, బొట్టు రాజు, సాదిక్, రాజ్‌కుమార్, బర్ల వెంకటేశ్వర్లు, కొండేటి సునంద్, బరాబరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం పలుకుదాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్

ఖిలా వరంగల్: ఈనెల 17న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో రూ.420 కోట్ల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనకు విచ్చేస్తున్న ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు ఘనంగా స్వాగతం పలుకుదామని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శాంతినగర్‌లోని రాజశ్రీగార్డెన్‌లో గురువారం జరిగిన సమావేశంలో కార్పొరేటర్లు, ఇన్‌చార్జ్‌లు, డివిజన్ అధ్యక్షులకు ఎమ్మెల్యే నరేందర్ మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం ఓసిటీ మైదానంలో కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణ స్థలంలో భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, కార్పొరేటర్లు, నాయకులు ముస్కమల్ల అరుణ, సుధాకర్, పోశాల సదానందం, మరుపల్లి రవి, దిడ్డి కుమారస్వామి, కావేటి కవిత, ఫుర్కాన్, సొసైటీ అధ్యక్షుడు కేడల జనార్దన్, దుబ్బా శ్రీనివాస్, బయ్య స్వామి, ఈద్గా అధ్యక్షుడు జబ్బార్, కేడల పద్మ, శ్రీరాం రాజేష్, పగడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దాతలు

వరంగల్: వరంగల్ ఎల్‌బీనగర్‌లో శ్యామల జయప్రకాశ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్‌కుమార్, మహ్మద్ అయూబ్, నేహాల్ మాట్లాడుతూ పేదలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ నిర్వాహకులు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని సూచించారు. గొల్లన రవి, జన్ను వేణు, తజమ్ముల్, హుస్సేన్, సోహేల్ పాల్గొన్నారు.

రూ.లక్ష సాయం అందజేయాలి

మడికొండ: చేనేత అనుబంధ సంస్థలో పని చేస్తున్న ప్రతీ కార్మికుడికి రూ.లక్ష సాయం అందజేయాలని మడికొండ చేనేత కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు నామని కుమారస్వామి కోరారు. మడికొండ పద్మశాలి సంఘంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కులవృత్తుల కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రకటించిన రూ. లక్ష పథకాన్ని పద్మశాలీలకు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. 300 మంది పద్మశాలీలు మడికొండ ఇండస్ట్రియల్ ప్రాంతంలోని టెక్స్‌టైల్ పార్కులో మగ్గాల ద్వారా ఉపాధి పొందుతున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం కార్యదర్శి తాటిపాముల సత్యనారాయణ, కన్నె మల్లేషం, పొట్లబత్తిని సారంగపాణి, చిదురాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

భూ బాధితులకు పరిహారం చెల్లించాలి


బాధితులతో మాట్లాడుతున్న ఏసీపీ కిషన్

ఖిలా వరంగల్: ఇన్నర్ రింగ్ రోడ్డు భూ బాధితులకు వెంటనే పరిహారం చెల్లించాలని బాధితులు కోరారు. ఈమేరకు వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లో చేపట్టిన నిరసన దీక్ష గురువారం రెండోరోజుకు చేరింది. దీక్షా శిబిరాన్ని బీజేపీ నేత, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సందర్శించి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వ దిగివచ్చి పరిహారం చెల్లించేవరకూ బాధితులతో కలిసి పోరాటాలు చేస్తామని ప్రదీప్‌రావు తెలిపారు. గురువారం మధ్యాహ్నం రింగ్‌రోడ్డు భూ బాధితుల దీక్షా శిబిరాన్ని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ సందర్శించారు. నిరసన దీక్ష విరమించాలని కోరారు. అలాగే సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య సందర్శించి దీక్షకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బాధితుల సంఘం అధ్యక్షుడు గంగుల దయాకర్, బత్తిని ఉమాశంకర్, బజ్జూరిప్రసాద్, ఆనందం, రామస్వామి, ఎండీ.రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌కు సన్మానం


కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సమ్మయ్య, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి జన్ను కిరణ్‌కుమార్‌కు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ జన్ను కిరణ్‌కుమార్ కష్టపడి చదివి ఎంఫార్మసీ కోర్సులో టాపర్‌గా నిలిచారని గుర్తుచేశారు. 2011లో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రభుత్వ అనలిస్టుగా, 2017లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారని వివరించారు. 2021లో నగరంలో పాపాయ్యపేట చమన్‌లో మెగా ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బొరగాల రాజమోహన్, అంబేడ్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రాజ్‌కుమార్, పరిశోధక విద్యార్థులు శ్రీరమ్య, స్వర్ణలత, సుప్రియ, స్ఫూర్తి, కుమార్, భరత్, స్నేహ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


సమస్యలపై సర్వే చేస్తున్న నాయకులు

కరీమాబాద్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ వరంగల్ జిల్లా కమిటీ కన్వీనర్ ముడేళ్ల ఉపేందర్ డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 32వ డివిజన్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటలో గురువారం ఇల్లిల్లు తిరుగుతూ సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని, పారిశుద్ధ్యం సమస్యను పరిష్కరించాలని, వీధి కుక్కల బెడదను అరికట్టాలని సూచించారు. ఎన్నికల హామీలను ప్రజాప్రతినిధులు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు అప్పాజి వాణి, మద్దూరి విజయ, విమల, రమ్య, రాజు, యాకుబ్ పాషా, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

‘హీమోఫిలియా’ సేవలు అభినందనీయం


రాజుకు చెక్కు అందజేస్తున్న చంద్రశేఖర్, సభ్యులు

ఎంజీఎం / కాశిబుగ్గ: హీమోఫిలియా సొసైటీ వరంగల్ సేవలు అభినందనీయమని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ కొనియాడారు. హిమోఫిలియా వ్యాధితో బాధపడుతున్న నర్సంపేటకు చెందిన కోట రాజుకు హీమోఫిలియా సొసైటీ వరంగల్ సభ్యులు రూ.10 వేల విలువగల చెక్కును చంద్రశేఖర్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు నరెడ్ల సుమన్, నరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ కోట రాజు గృహనిర్మాణానికి తమవంతుగా అబ్బడి రామకృష్ణ సహకారంతో రూ.10 వేలు అందజేసినట్లు తెలిపారు.

సంక్షిప్తంగా

గురుకులాల్లో టెండర్లు రద్దు చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రాజేందర్, నరేష్

హన్మకొండ అర్బన్: జిల్లాలోని మడికొండ బాలికలు, హసన్‌పర్తి బాలికలు, భూపాలపల్లి డిగ్రీ మహిళా కళాశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా క్యాటరింగ్ టెండర్ నోటిఫికేషన్ ఇవ్వకుండానే గుత్తేదారులకు అమ్ముకున్నారని బీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్, ఏబీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల నరేష్ తెలిపారు. ఆ టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు.

మార్కెట్ ఉద్యోగి రవీందర్ మృతి

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని అకౌంట్ విభాగం ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న యూ.రవీందర్ బుధవారం మృతి చెందారు. వారం రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో అతన్ని చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందారు. ఈమేరకు మార్కెటింగ్‌శాఖ జేడీఎం మల్లేషం, డీడీఎం రాజునాయక్, డీఎంఓ ప్రసాదరావు, మార్కెట్ కార్యదర్శి బీవీ.రాహుల్, గ్రేడ్–2 కార్యదర్శులు బియాబాని, రాము, ఉద్యోగులు రాజ్‌కుమార్, శ్రీనివాసరాజు, శివ, కృష్ణ, మురళి, సిబ్బంది గురువారం ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామంలోని రవీందర్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఆలయ భూమిని మేమే కాపాడుతున్నాం



నయీంనగర్: హనుమకొండ డబ్బాల జంక్షన్‌లోని దాసాంజనేయ స్వామి ఆలయ భూమిని కాపాడుతోంది తామేనని, ఆలయ భూముల జోలికి వస్తే ఊరుకోబోమని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, హనుమాన్ పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షుడు గుంటి శ్రీనివాస్, 58 డివిజన్ కార్పొరేటర్ సోదా కిరణ్, 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు హెచ్చరించారు. హనుమాన్ ఆలయ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలయ భూమి కబ్జాకు గురైన ప్రతిసారీ స్థానిక ఎమ్మెల్యేనే కాపాడారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీపై, నాయకులపై నిందారోపణలు చేస్తే సహించేది లేదని అన్నారు. రాజకీయ లబ్ధి పొందడానికే బీఆర్ఎస్ పార్టీ నాయకులపైన కొంత మంది నిందారోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, హనుమాన్ పరిరక్షణ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్‌లో 502మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో గురువారం ఉదయం నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలో 7,121 మంది విద్యార్థులకు 6,619మంది హాజరుకాగా, 502 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్ విద్య డీఐఈఓ గోపాల్ తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్ సెకండియర్ పరీక్షలో 1,659మంది విద్యార్థులకు 1,572 మంది విద్యార్థులు హాజరయ్యాయని వివరించారు.

‘టెన్త్ పరీక్ష’కు 15 మంది హాజరు

కాశీబుగ్గ సెంటర్: వరంగల్ జిల్లాలో గురువారం నిర్వహించిన టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ హిందీ పరీక్షకు 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. 23 మంది విద్యార్థులకు 15 మంది మాత్రమే హాజరైనట్లు ఆమె పేర్కొన్నారు.

ఇంటర్‌లో 154 మంది గైర్హాజరు..

వరంగల్ జిల్లాలో గురువారం నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 154 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ కాక మాధవరావు తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షకు మొత్తం 2,093 మంది విద్యార్థులకు 1,970 మంది, రెండో సంవత్సరం పరీక్షకు 884 మంది విద్యార్థులకు 853 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

పద్మశాలీల సభ్యత్వ నమోదు



ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో పద్మశాలి సంఘం అధ్యక్షుడు వద్నాల మల్లయ్య అధ్యక్షతన పద్మశాలీల కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ హాజరై పద్మశాలి సంఘం ప్రతినిధులతో కలిసి 18 ఏళ్లు పైబడిన పద్మశాలి యువతి, యువకులకు సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్, మాచర్ల వెంకటేశ్వర్లు, బైరి ఎర్రగట్టు, దాసి సురేందర్, రాజలింగం, రాజు, సదానందం, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

‘సెమినార్‌లో తాళ్ల పద్మావతి విద్యార్థులు’


ఆన్‌లైన్ సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు

కరీమాబాద్: ప్రపంచ వ్యాప్తంగా ప్రతీనెలా నిర్వహించే ఆన్‌లైన్ సెమినార్‌లో భాగంగా గురువారం నిర్వహించిన సెమినార్‌లో వరంగల్ ఉర్సుగుట్ట తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 15మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సెమినార్‌లో దాదాపు 20 దేశాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా సమకాలీన దేశీయ, అంతర్జాతీయ విషయాలపై ఆన్‌లైన్‌లో చర్చాగోష్ఠి నిర్వహించారు. జపాన్, రొమేనియా, నైజీరియా, వియాత్నం, టర్కీ, పాకిస్తాన్, తైవాన్, ఇండియా, మలేషియా, ఈజిప్టు, తునిసియా తదితర దేశాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అయితే ‘భారతదేశపు ప్రస్తుత పరిస్థితులు’, ‘అవాంఛిత పాఠశాల నియమాలు’ అనే రెండు అంశాలపై తాళ్ల పద్మావతి విద్యార్థులు మాట్లాడారు. ఈ నేపథ్యంలో వారిని పాఠశాల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్ డాక్టర్ వరుణ్, ప్రిన్సిపాల్ స్వర్ణ, గైడ్ శ్రీదేవి, సర్జా తదితరులు అభినందించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాట్ల పరిశీలన

వరంగల్ అర్బన్: వరంగల్ కొత్తవాడలో ఏర్పాటు చేయనున్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను నగర మేయర్ గుండు సుధారాణి గురువారం పర్యవేక్షించారు. చేనేత పారిశ్రామిక సహకార సంఘం, వీవర్స్ సభ్యులతో కలిసి కేటీఆర్ పర్యటనపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బల్దియా ఈఈ శ్రీనివాస్, డీఈ సారంగం, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

35మంది విద్యార్థులకు ఉద్యోగాలు


నియామక పత్రం అందజేస్తున్న ఎస్‌వీఎస్ కళాశాల సెక్రటరీ డాక్టర్ హర్షిణి

హసన్‌పర్తి: ఎస్‌వీఎస్ కళాశాలలోని ఆయా విభాగాలకు చెందిన 35 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు తెలిపారు. భీమారంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను గురువారం నిర్వహించారు. ఏడు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా, పెంటగాన్ స్పేస్‌లో 8మంది విద్యార్థులు, ఎస్‌వీఎస్ హెల్త్‌లో 9మంది, ప్రతిమలో ముగ్గురు, మమత ఇన్‌ఫ్రాలో 15మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని తిరుమల్‌రావు వివరించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ఎస్‌వీఎస్ కళాశాల సెక్రటరీ డాక్టర్ ఎర్రబెల్లి హర్షిణి నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈవీ.రావు, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సీహెచ్.సుశాంత్, వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మహనీయులకు ఘన నివాళి



హన్మకొండ: మహాకవి శ్రీశ్రీ, కల్నల్ బిక్కుమళ్ల సంతోష్ బాబు వర్ధంతిని హనుమకొండ హనుమాన్ నగర్–1లో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ), దేశ రక్షణ కోసం చైనా సరిహద్దుల్లో వీరమరణం పొందిన మహా వీరచక్ర కల్నల్ బిక్కుమళ్ల సంతోష్‌బాబు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కుమార్‌రెడ్డి, మాదారపు ఉదయ్‌కిరణ్, సిరిమల్లె రాజయ్య, చిర్ర శ్రవణ్, రాజ్‌కుమార్, వెంకటేష్, సురేష్, రాంచందర్, రియాజ్ పాల్గొన్నారు.